# 'మీ-సేవ' ద్వారా బ్యాంకింగ్ సేవలు

## జిల్లాలోనే తొలిసారిగా అమలు ☆ మంత్రి పొన్నాల లక్ష్మయ్య

**కలెక్టరేట్:** రాష్ట్రంలోనే మొదటిసారిగా జిల్లాలో మీ సేవ ద్వారా బ్యాంకింగ్ సేవలు అందిస్తున్నట్లు ఐటీ శాఖ మంత్రి పొన్నాల లక్ష్మయ్య తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో గ్రామీణ మీ సేవ ద్వారా బ్యాంకింగ్ సేవలను మంత్రి పొన్నాల శనివారం ప్రారంభించారు. అనంతరం మీడియా సమావేశంలో మాట్లాడారు. పేద ప్రజలకు బ్యాంకు సేవలను అందుబాటులోకి తేవడానికి ఈ కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. జిల్లాలోని నార్లాపూర్, కమలాపూర్, లింగాపురం, ఆగపేట్, ఫతేపూర్, గ్రామాలలో ఆదివారం నుంచి బ్యాంకింగ్ సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. ఇప్పటి వరకు 200 గ్రామీణ మీ సేవ కేంద్రాలలో ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు.

ఏప్రిల్ 30 నాటికి రాష్ట్రంలోని 4 వేల గ్రామీణ మీ సేవ కేంద్రాలను బ్యాంకింగ్ సేవలకు అనుసంధానం చేయనున్నట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నగదు బదిలీ పథకాన్ని 5 జిల్లాల్లో ప్రయోగాత్మకంగా చేపట్టినట్లు తెలిపారు. ఈ సంవత్సరంలో దేశవ్యాప్తంగా 15 వందల జనాభా గల గ్రామానికి ఒకటి చొప్పున లక్ష కామన్ సర్వీస్ సెంటర్(సియస్‌సి) ఏర్పాటు చేయాలనేది ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. మీ సేవ ద్వారా ప్రస్తుతం 88 సేవలు అందిస్తున్నామని త్వరలో 350 సేవలు అందించాలనేది లక్ష్యమని మంత్రి తెలిపారు.

జిల్లాలో 425 మీ సేవసెంటర్‌ల ద్వారా 8,29,253 సేవలు వినియోగించుకొన్నారని, క్యాటగిరి ఎలో 4,18,356 సేవలు వినియోగించుకొనగా రాష్ట్రంలో నాల్గవ స్థానంలో ఉందన్నారు. ఎస్‌బిఐ మేనేజర్ ఉత్పల్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం 2 వేల జనాభా ఉన్న గ్రామాలలో బ్యాంకింగ్ సేవలు తప్పనిసరిగా అందజెయ్యడానికి నిర్ణయం తీసుకుందన్నారు. గ్రామీణ మీ సేవ ద్వారా బ్యాంక్ అందజేసే అన్నిరకాల సేవలు పొందవచ్చాన్నారు. జీరో అకౌంట్‌లు తెరవవచ్చాన్నారు. 10వేల రూపాయలవరకు బ్యాంక్ ఖాతాలో జమచేసుకోవచ్చుని, తీసుకోవచ్చున్నారు. కార్యక్రమంలో కలెక్టర్ రాహుల్‌బొజ్జా, జాయింట్ కలెక్టర్ ప్రద్యుమ్న, మీసేవ అధికారి గోపినాథ్, లీడ్ బ్యాంక్ మేనేజర్ దత్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి పొన్నాల లక్ష్మయ్య

# మడికొండ వద్ద ఐటీ ఇంకుబేషన్ టవర్

## నేడు శంకుస్థాపన చేయనున్న మంత్రి పొన్నాల

**మడికొండ :** రాష్ట్ర మంత్రి వర్గంలో ఐటీ శాఖా మంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న పొన్నాల లక్ష్మయ్య సారధ్యంలో గతంలో ప్రకటించిన ఐటీ సెజ్‌లో ఇంకుబేషన్ టవర్ పనులకు ఆదివారం శంకుస్థాపన చేయనున్నారు. పొన్నాల లక్ష్మయ్య చేతుల మీదుగా జరిగే ఈ కార్యక్రమంలో సెంటర్ నిర్మాణానికి రూ. 4 కోట్ల 46 లక్షల నిధులకు సాంకేతిక మంజూరు కావడం విశేషం. మడికొండ వద్ద ఏర్పాటు కానున్నన ఇంకుబేషన్ టవర్ ఏర్పాటు ద్వారా జిల్లాలో ఐటీ పరిశ్రమ శీఘ్రగతిన అభివృద్ధి చెందే అవకాశాలు ఉన్నాయి. ఐటీ పరిశ్రమను ప్రోత్సహించే లక్ష్యంతో వరంగల్ నగరంతో పాటు కరీంనగర్, కాకినాడ, తిరుపతిలో వీటిని ఏర్పాటు చేస్తున్నారు. ఏపీ పారిశ్రామిక మౌళిక సదుపాయాల కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఇంకుబేషన్ సెంటర్ నిర్మాణం జరగనున్నది. మడికొండలోని 45 ఎకరాల విస్తీర్ణంలో ఐటీ సెజ్ ఏర్పాటు చేయనున్నారు.

దీని కోసం గతంలోనే రూ. ఒక కోటి 98 లక్షలతో కాంపౌండ్ వాల్, రోడ్లను ఏపీఐఐసీ ఏర్పాటు చేసింది. మడికొండలో ఏర్పాటు చేయనున్న ఇంకు బేషన్ సెంటర్‌లో 15 వేల ఎస్‌ఎఫ్‌టీ స్పేస్ అందుబాటులో రానుంది. రెండు ఎకరాల స్థలంలో జి-2 అంతస్థులలో సెంటర్‌ను నిర్మించనున్నారు. సుమారు 9 నెలల్లో ప్రాజెక్టు నిర్మాణం పూర్తవుతుందని అంచనా వేస్తున్నారు. ఈ సెంటర్‌లో ఐటీ విద్యార్థులకు ప్రాజెక్టులలో శిక్షణ ఇవ్వడంతో పాటు మార్కెట్‌లో ఉపాధి అవకాశాలను చూపిస్తుంది.